

# మంగువారి బంగళా

కిల్లాన మోహనబాబు

"ఈ విషయం విన్నావా గురూ" అంటూనే గదిలోకొచ్చాడు గుర్నాధం.

'ఏవిటన్నట్లు' చూశాన్నేను చదువుతున్న వీక్లీ పక్కన పెట్టి.

"మన క్లాస్‌మేట్ మహేశం వారం రోజుల క్రితం ఆఫీసు పనిమీద కలకత్తా వెళ్తూ 'హార్ట్ ఎటాక్' వచ్చి రైల్లోనే చనిపోయాడు."

తుళ్ళిపడ్డాన్నేను.

"చాలా దారుణమైన వార్త చెప్పావు గురూ. నేనిది నమ్మలేకపోతున్నాను" అన్నాను బాధ నిండిన గొంతుతో.

"నేనూ మొదట నమ్మలేదు. ఈ సాయంత్రమే నాకీ వార్త తెలిసింది. వెంటనే వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడ అతని భార్య, పిల్లల ముఖాలు చూసేసరికి ఎవరో నా గుండెల్ని పిండినట్లయింది." అన్నాడు గుర్నాధం.

"నేనూ వెళ్ళి వాళ్ళని పరామర్శించి రావాలి" అన్నాను సిగరెట్ ముట్టించి.

"వద్దు గురూ. ఇప్పటికే వాళ్ళు సగం చచ్చి జీవచ్ఛవాల్లా ఉన్నారు. వెళ్ళిన ప్రతివాళ్ళనూ చూసి వాళ్ళు మరీ దిగులు పడుతున్నారు. పరామర్శ పేరుతో మనం వెళ్ళడం వాళ్ళ మనసులో గాయాన్ని మరింత రేపడం అవుతుంది."

"అదీ కరక్టే. కొంతకాలం ఆగి వెళ్తే బావుంటుంది. మనం కాలేజీలో చదివే రోజుల్లో మహేశం ఎంతో హుషారుగా ఉండేవాడు. ఇపుడు వాడి భార్యా పిల్లల గతేమిటి? ప్రభుత్వం ఇచ్చే డబ్బు వాళ్ళకేం సరిపోతుంది? ఏమిటో పట్టుమని నలభై సంవత్సరాలైనా లేని మనుషులు గుండాగి చనిపోతుంటే మన మనుగడ మీద మనకే నమ్మకం పోతుంది."

అన్నాను దిగులుగా.

"నిజమే. భవిష్యత్తు గురించి మనం కనే కలలు, మనం వేసుకునే 'ప్లాన్స్' యివన్నీ 'ఆత్మవంచన' కింద జమ కట్టాల్సి వస్తుంది. ఎలా జరగాల్సింది

అలా జరిగి తీరుతుంది అనే ఫిలాసఫీతో ప్రతి ఒక్కరూ 'కాంప్రొమైజ్' అయ్యే రోజులు వచ్చాయి" అన్నాడు గుర్నాధం.

నేను కుర్చీలోంచి లేచి 'ఫ్రిజ్' తెరచి, అందులోంచి 'మెక్‌డొవెల్ హాఫ్' బాటిల్ తీసి గ్లాసుల్లో పోసి ఐస్‌వేశాను. జీడిపప్పు రెండుప్లేట్లల్లో సర్దాను.

ఇద్దరం మవునంగా 'సిప్' చేయడం ప్రారంభించాం 'ఛీర్స్' చెప్పుకోకుండా!

క్షణాలు భారంగా దొర్లిపోతున్నాయి.

బాధ నిండిన హృదయం మరింత బరువుగా మారింది బాటిల్ ధర్మమా అని.

రక్తప్రసరణం జోరుగా సాగుతోంది!

మందు తన ప్రభావాన్ని చూపుతోంది!

"నీకో విషయం చెప్పనా గురూ" అన్నాను నేను ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"చెప్పు గురూ. ఈ సైలెన్స్ భరించలేకపోతున్నాను" అన్నాడు గుర్నాధం.

"నా ఉద్యోగం వచ్చిన కొత్తలో నన్ను శ్రీకాకుళం పోస్ట్ చేశారు. అప్పుడు ఓ గమ్మత్తైన సంఘటన జరిగింది. అదెందుకో ఇప్పుడు గుర్తొచ్చింది 'సడన్'గా" అన్నాడు 'సెకండ్ రౌండు' పూర్తిచేస్తూ.

"అదేంటో వివరంగా చెప్పు" అన్నాడు గుర్నాధం తన గ్లాసు టేబిల్ మీద ఉంచుతూ.

* * *

శ్రీకాకుళంలో కొత్తగా ఉద్యోగంలో చేరిన నేను ఆఫీసుకి దగ్గర్లోనే ఓ రూమ్ తీసుకున్నాను. రోజూ ఉదయం లేవడంతోనే కాఫీ తాగడం, మరో గంట తరువాత హోటల్‌లో భోంచేసి ఆఫీసుకి పోవడం— మళ్లీ సాయంత్రం ఇంటికి వచ్చి పుస్తకాలు చదువుకుని రాత్రికి క్యారేజీ తెప్పించుకుని తిని పడుకోవడం— ఇదీ నా బ్రహ్మచారి జీవితంలోని దిన చర్య. క్రమంగా ఈ జీవితం విసుగు పుడుతూ ఉండేది. రోజూ ఆఫీసుకి వెళ్ళేటప్పుడు సాధ్యమయినంత ముందుగా వీధిలోనికి వచ్చేసి రోడ్డుప్రక్కనున్న షాపుల్ని గమనించడం.... రోడ్డుమీద నడిచే వాహనాల్ని, మనుషుల్ని గమనించడం వగైరా అలవాటు చేసుకున్నాను కాలక్షేపం కోసం.

నేను ఆఫీసుకి వెళ్లే త్రోవలో ఓ జోళ్లుకుట్టే చమారి ఓ పాత బంగళా క్రింద కూర్చునేవాడు. ఆ బంగళాని అందరూ 'మంగువారి బంగళా' అనేవారు. అది బాగా పాడుపడిపోయి, 'ఏ నిముషంలో పడిపోతుందా' అన్నట్లుండేది. మెయిన్‌రోడ్డులో ఆ బంగళా ఊరికి 'దిష్టిబొమ్మ'లా కన్పించేది. అన్నదమ్ముల ఆస్తి తగాదాలు యింకా కోర్టులోనే ఉన్నందువల్ల అదలా ఉండిపోయిందని ఎవరో చెప్పారు.

ఆ చమారి మాత్రం ఎప్పుడూ ఆ బంగళా క్రిందే కూర్చునేవాడు. 'అతనికెప్పుడయినా ప్రమాదమే సుమా'

అనుకునేవాణ్ని నేను. జాలినిండిన అతని కళ్లు మాత్రం నన్ను బాగా కదిలించివేశాయి. రోడ్డుమీద నడిచేవారి పాదాలవేపు అతను ఆశగా, ఆత్రంగా చూసేవాడు. అతని కళ్ళలో 'నిస్సహాయత' కనిపించేది నాకు........ అందుకే నా 'షూస్' అప్పుడప్పుడూ అతనిచేత 'పాలిష్' చేయించేవాణ్ని. ఇంట్లో పాలిష్‌డబ్బా ఉన్నా కేవలం అతనికి డబ్బులివ్వాలన్న ఉద్దేశంతోనే అలా చేసేవాణ్ణి.

రోజూ రోడ్డు ప్రక్కన అతని ముందునుంచే ఓ సంవత్సరంపాటు నడిచి వెళ్లడంతో అతనితో నాకు ఓ అనుబంధం ఏర్పడింది. ఏ ఒక్కరోజూ అతను కూర్చునే స్థలంలో లేకపోవడం జరగలేదు. ఓ రోజు నేను ఆఫీసుకి మామూలుగా వెళ్లాను. 'లంచ్ బ్రేక్'లో కేంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుతుండగా వెనక మా ఆఫీసులోనే మరో సెక్షన్‌లో పనిచేస్తున్న యిద్దరి గుమస్తాల సంభాషణ వినిపించింది.

"ఇందాక ఆ సెంటర్లోని 'మంగువారి బంగళా మీదఅంతస్తు గోడ కూలిపోయి క్రిందఉన్న ఓ మనిషి చనిపోయాడు తెలుసా" అన్నమాట విన్న నా గుండెలు ఝల్లుమన్నాయి ఒక్కసారిగా.

"ఆ బంగళా ముందు ఓ జోళ్లకుట్టే చమారి ఉంటాడు ఎప్పుడూ. అతనికి నూరేళ్ళు నిండిపోయాయన్నమాట" మరో గుమస్తా సానుభూతి వాక్యాలు కూడా వినిపించాయి.


తాగుతున్న కాఫీ అలాగే వదిలి అక్కడనుండి లేచి భారంగా మా సెక్షను వేపు నడిచాను.

ఫైళ్లలోని కాగితాల్లో ఆ జోళ్లు కుట్టే వాని ముఖమే కదుల్తోంది. ఏ కాగితమూ సరిగ్గా చదవలేకపోయాను. గుండెలు భారంగా మారాయి. కళ్లు మూసినా తెరిచినా అతని రూపమే కనిపిస్తోంది. అతనితో నా పరిచయం ఇంత అనుబంధంగా మారిందేమిటని నాకే ఆశ్చర్యమేసింది.

అయిదయిన తరువాత ఆఫీసునుండి బయటకొచ్చాను. ఆ త్రోవలో వెళ్తే మరి యిప్పుడతని ముఖం నాకు కనిపించదు. అతను రోజూ కూర్చునే స్థలం ఖాళీగా బోసిపోయి ఉంటుంది. ఆ దృశ్యం తను భరించలేదు. అందుకే మరో త్రోవలో దూరమైనా చుట్టూ తిరిగి రూమ్‌కి వచ్చాను.

ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. అలాగే పడుకున్నాను. నిద్దుర కూడా సరిగ్గా పట్టలేదు....

ఆ మర్నాడు మామూలుగా తయారై ఆఫీసుకి బయలుదేరాను. 'మంగువారి




బంగళా దగ్గర పడ్తోంది.... నా గుండెల వేగం హెచ్చింది....

అక్కడ.... ఆ బంగళా దగ్గర ఆ జోళ్ళకుట్టే చమారి మామూలుగా జోళ్ళు కుడుతూ కన్పించాడు మసకమసకగా....

పరుగున అతని దగ్గరకు వెళ్లాను ఆనందంతో....

నా వైపు అతను అలవాటుపడిని చిరునవ్వుతో చూశాడు....

'షూ' పాలిష్ చెయ్యమని యిచ్చాను.

బంగళా మీదకి చూశాను. అంతకు ముందున్న పాడుబడ్డగోడ యిప్పుడు అక్కడ లేదు.

"నిన్న యిక్కడేదో ప్రమాదం జరిగింది.... ఎవరో చనిపోయారని విన్నాను" అన్నాను గొంతు మామూలుగా ఉంచడానికి ప్రయత్నిస్తూ.

"ఔను బాబూ. ఒకాయన పాలిష్ కోసం వచ్చాడు. తీరా అప్పుడే నా పాలిష్ డబ్బాలో పాలిష్ అయిపోయింది అది కొందామని ఎదురుగా ఉన్న బాటా షాపులోకి ఎల్లాను. నేను తిరిగొచ్చేలోపు.... అదిగో ఆ గోడ అయనమీద పడిపోయింది. గొల్లుమని అందరూ తలో చెయ్యివేసి యిటుకలు తీశాం. అయినా అతను అప్పటికే పోయాడు బాబూ. ఈ దారుణం అంతా చిటికెలో జరిగిపోయిందంటే నమ్మండి" అన్నాడు.

"అయ్యో పాపం" అన్నాను గొంతులో దుఃఖం ధ్వనింప చేయడానికి ప్రయత్నిస్తూ.

నిజానికి ఆ అజ్ఞాతవ్యక్తి చనిపోయినందుకు నాకు ఏ మాత్రం విచారం లేదు– ఈ జోళ్లు కుట్టే వ్యక్తి బ్రతికాడన్న ఆనందం తప్ప!

—x—